హిందూజా కుటుంబానికి నాలుగేండ్ల జైలు

జెనీవా, జూన్ 21: తమ ఇంట్లో వివిధ పనుల కోసం నియమించిన పనివారి శ్రమను దోపిడీ చేశారంటూ హిందూజా కుటుంబంపై వచ్చిన ఆరోపణలను న్యాయస్థానం నిర్ధారించింది. దీంతో భారత సంతతికి చెందిన సంపన్న హిందూజా కుటుంబంలోని నలుగురికి జెనివాలోని స్విస్ క్రిమినల్ కోర్టు శుక్ర వారం నాలుగు నుంచి నాలుగున్నర ఏండ్ల జైలు శిక్షను విధించింది. అయితే వారు మానవ అక్రమ రవాణాకు పాల్పడినట్టు నమోదైన ఆరోపణలను కోర్టు తోసిపుచ్చింది. భారత్‌లో జన్మించిన వ్యాపారవేత్త ప్రకాశ్ హిందూజా, అతని భార్య, కుమారుడు, కోడలు భారత్ నుంచి అక్రమంగా కొందరు పనివారిని రప్పించినట్టు అభియోగం. జెనివాలోని విల్లాల్లో వారిచేత రోజుకి 18 గంటలు పనిచేయించుకునే వారని, వారు ఎక్కడికీ వెళ్లకుండా పాస్‌పోర్టులు తమ వద్ద ఉంచుకునేవారని, స్విస్ చట్టాల ప్రకారం నిర్దేశించిన కనీస వేతనాల్లో 10వ వంతు కూడా వారికి చెల్లించే వారు కాదని ఆరోపణలున్నాయి.

ఉద్యోగం పేరుతో 150 మందిపై లైంగిక దాడి

పాట్నా, జూన్ 21: బీహార్‌లో దారుణ ఉదంతం వెలుగుచూసింది. ఉద్యోగా లిస్తామని ఆశచూపి 150 మంది మహిళలను రప్పించి వారిని బంధించి కొన్ని నెలలుగా లైంగిక దాడి చేస్తున్న కంపెనీ నిర్వాహకుల దారుణం బయటప డింది. డీబీఆర్ నెట్‌పర్క్ పేరుతో వీరు సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలు ఇచ్చేవారు. కాల్‌సెంటర్‌కు మహిళా ఏజెంట్లు కావాలని ప్రకటించే వారు. అది నమ్మి ఇళ్ల నుంచి ఉద్యోగాల కోసం వచ్చిన మహిళలను ఒక రూములో బంధించి వారిపై నెలల తరబడి లైంగిక దాడి చేసేవారు. ఎవరికైనా చెబితే అంతుచూస్తామని బెదిరించే వారు. ఇలా 150 మంది మహిళలను వీరు బందీలుగా చేసి అక్రత్యాలకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు.

హెలికాప్టర్లతో దోమల విడుదల

న్యూఢిల్లీ: ముదురు రంగులతో ఆకర్షణీయంగా ఉండి హవాయి దీవుల్లో ఎంతో సందడి చేసే హనీక్రీపర్ పక్షులు కనుమరుగైపోతున్నాయి. దోమల ద్వారా సంక్ర మిస్తున్న ఏవియన్ మలేరియా వ్యాధి బారినపడి మరణిస్తున్నాయి. దీంతో ఇప్పు టికే 33 జాతుల హనీక్రీపర్ పక్షులు అంతరించిపోవడంతోపాటు మరికొన్ని జాతు లకు ముప్పు పొంచి ఉన్నట్టు నివేదికలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో హనీక్రీ పర్ పక్షులను కాపాడేందుకు అధికారులు చివరి ప్రయత్నం చేస్తున్నారు. అందులో భాగంగా సంతానోత్పత్తిని నిరోధించే 'ఓల్బాచియా' అనే సహజసిద్ధమైన బ్యాక్టీరి యాను కలిగి ఉండే మగ దోమలను హెలికాప్టర్ల ద్వారా విడుదల చేస్తున్నారు. వీటితో జతకట్టిన ఆడ దోమలు గుడ్లను పొదగలేవని అధికారులు తెలిపారు.

రేప్ కేసుల్లో అబార్షన్లకు యూఏఈ ఓకే

న్యూఢిల్లీ, జూన్ 21: ఇస్లామిక్ దేశమైన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూ ఏఈ) మహిళల విషయంలో కీలక నిర్ణయం తీసుకున్నది. అత్యాచారం, అక్రమ సంబంధం లాంటి కేసుల్లో అబార్షన్లను అనుమతించేందుకు ఓ తీర్మానాన్ని ఆమోదించింది. దీని ప్రకారం.. అత్యాచారం లేదా అక్రమ సంబంధం వల్ల గర్భం దాల్చితే దాన్ని తొలగించుకునేందుకు అనుమతి లభి స్తుంది. మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని 120 రోజుల్లోపు గర్భాన్ని మాత్రమే తొలగించుకునేందుకు వీలు కల్పించారు.

తజికిస్థాన్‌లో హిజాబ్‌పై నిషేధం

దుషంబే (తజికిస్థాన్), జూన్ 21: హిజాబ్‌తో పాటు ఇతర ఇస్లాం సంప్ర దాయ దుస్తుల ధారణపై తజికిస్థాన్ నిషేధం విధించింది. వివాదాస్పదమైన ఈ బిల్లుకు ఆ దేశ పార్లమెంట్ బుధవారం ఆమోదం తెలిపింది. మాజీ సోవి యట్ రిపబ్లిక్ దేశమైన తజికిస్థాన్‌లోని అత్యధిక ముస్లిం జనాభాలో ఈ బిల్లు అలజడిని కలిగించింది. అంతేకాకుండా తజికిస్థాన్‌తో సరిహద్దును పంచుకుం టున్న తాలిబన్ పాలనలోని అఫ్గానిస్థాన్ సహా పలు ముస్లిం దేశాల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమయ్యే అవకాశం ఉంది.

హజ్ యాత్రలో 98 మంది భారతీయులు మృతి

న్యూఢిల్లీ: హజ్ యాత్రలో 98 మంది భారతీయులు మరణించినట్టు విదే శాంగ శాఖ వెల్లడించింది. ఆ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ గతంలో కన్నా ఈ ఏడాది మృతుల సంఖ్య తగ్గిందని, గత ఏడాది 187 మంది మరణించినట్టు చెప్పారు. ఈ ఏడాది హజ్ యాత్రకు ఇప్పటివరకు 1,75,000 మంది వెళ్లారన్నారు. అయితే వీరిలో 98 మంది మరణించారని, ఇవన్నీ వృద్ధాప్య, దీర్ఘకాలిక రోగాల కారణంగానే సంభవించాయన్నారు.

నీటి విడుదల కోసం ఆతిశీ నిరాహార దీక్ష

న్యూఢిల్లీ: హర్యానా నుంచి మరింత నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ మంత్రి, ఆప్ నేత ఆతిశీ శుక్రవారం ఢిల్లీలోని భోగల్‌లో ఆమ రణ నిరాహార దీక్ష చేపట్టారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సతీమణి సునీతా కేజ్రీ వాల్, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ తదితరులు దీక్షా శిబిరంలో కూర్చు న్నారు. హర్యానా, ఢిల్లీలో వేర్వేరు పార్టీలు అధికారంలో ఉన్నప్పటికీ నీటి విషయంలో రాజకీయాలేమిటని కేజ్రీవాల్ తన సందేశంలో ప్రశ్నించారు.

పని ఇవ్వకుండా 20 ఏండ్లుగా జీతం.. కంపెనీపై దావా

ప్యారిస్, జూన్ 21: సాధారణంగా జీతం పెంచలేదనో, బోనస్ ఎగ్గొట్టారనో, ఇంక్రిమెంట్ ఇవ్వలేదనో యాజమాన్యాలపై ఉద్యోగులు ఫిర్యాదులు చేస్తుం టారు. కానీ ఫ్రాన్స్‌లో ఒక మహిళ తనకు గత 20 ఏండ్లుగా ఎలాంటి పని చెప్పకుండా పూర్తి జీతం ఇచ్చారని, ఇలా చేయడం వివక్షేనంటూ కోర్టుకె క్కింది. దివ్యాంగురాలైన లారెన్స్ వాన్ వాసెన్‌హోవ్ దిగ్గజ టెలికాం కంపెనీ ఆరెంజ్‌లో 1993లో చేరింది. 2002 వరకు ఆమెను హెచ్‌ఆర్ శాఖలో సెక్ర టరీగా విధులు నిర్వహించేది. 2002లో ఆమె విజ్ఞప్తి మేరకు ఫ్రాన్స్‌లోని మరో రీజియన్‌కు ఆమెను బదిలీ చేశారు. అయితే అక్కడ ఆమెకు ఎలాంటి పని అప్పగించకుండానే 20 ఏండ్ల పాటు పూర్తి జీతం, ఇతర అలవెన్స్‌లు ఇచ్చారు. అయితే 20 ఏండ్ల పాటు సంస్థ పనిచెప్పకుండా చేసిన నిర్వాకం కారణంగా తాను మానసికంగా ఎంతో వ్యధ అనుభవించానని, తోటి ఉద్యోగుల వద్ద అవ మానం పొందానని, దీనిపై యాజమాన్యంపై చర్య తీసుకోవాలంటూ ఆమె కోర్టులో కేసు దాఖలు చేసింది.

భూకంపంతో దిశ మారిన గంగానది

- **2500 ఏండ్ల క్రితం జరిగి ఉండొచ్చు**
- **తాజా అధ్యయనంలో వెల్లడి**

న్యూఢిల్లీ, జూన్ 21: ప్రపంచంలోనే రెండో అతి పెద్ద నదిగా గుర్తింపు పొందిన గంగానదికి సంబంధించి ఓ అధ్యయనంలో ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. గంగానదిపై వేర్వేరు దేశాల్లోని విశ్వవిద్యాలయాలకు చెందిన పరిశోధకులు చేసిన అధ్యయనం వివరాలు 'నేచర్ కమ్యూనికేషన్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. 2500 ఏండ్ల క్రితం సంభవించిన ఒక భూకంపం వల్ల గంగానది ప్రవాహ దిశను మార్చుకున్నదని ఈ అధ్యయనంలో తేలింది. సాధారణంగా నదులు క్రమంగా దిశ మార్చుకునేందుకు వందల ఏండ్లు పడుతుంది. గంగానది లాంటి పెద్ద నది దిశ మార్చుకోవడం దాదాపు జరగదని పరిశోధకులు చెప్తున్నారు. అయితే, ఒక భారీ భూకంపం కారణంగా గంగానది ఒకేసారి దిశ మార్చుకుందని వెల్లడించారు. ఉపగ్రహ చిత్రాలను అధ్యయనం చేసిన పరిశోధకులు దాదాపు 100 కిలోమీటర్ల మేర గంగా నది పాత ప్రధాన ప్రవాహ ప్రాంతాన్ని గుర్తించారు. రిక్టర్ స్కేలుపై 7 – 8 తీవ్రతతో సంభవించిన భూకంపం వల్ల ఈ మార్పు చోటు చేసుకొని ఉండొచ్చని పరిశోధకులు అభిప్రాయం వ్యక్తం చేశారు.